సాక్షి మంచిర్యాల

ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024



భక్తిమార్గంలో యువత

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా తండాల్లో భక్తిభావం పెరుగుతోంది. యువత సేవాలాల్ దీక్ష స్వీకరించి నియమనిష్టలతో నిత్యం పూజలు చేస్తున్నారు. 8లో▸

రంజాన్ వేళలు

ఆది
ఇఫ్తార్ 6:33

సోమ
సహర్ 4:42

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.4 /27.4

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆరోగ్యమే మహా భాగ్యం

• న్యాయమూర్తి అర్పిత మారంరెడ్డి



పండ్లు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి

మంచిర్యాలక్రైం: ఆరోగ్యమే మహా భాగ్యమని న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి అన్నారు. సుప్రీమ్ కోర్టు ఆదేశాల మేరకు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మాత శిశు కేంద్రంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు తీసుకోవాల్సి న జాగ్రత్తలు వివరించారు. అనంతరం బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీష్మ, డాక్టర్ వేదవ్యాస, డాక్టర్ కీర్తి, డాక్టర్ ప్రశాంతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

నీటి ఎద్దటి నివారణకు చర్యలు చేపట్టండి



సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్డీవో కిషన్

చెన్నూర్: వేసవి నేపథ్యంలో చెన్నూర్ మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డీఆర్డీవో కిషన్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తాగునీటి ఎద్దడిపై మున్సిపల్ కమిషనర్ గంగాధర్, మిషన్ భగీరథ ఏఈలు, వార్డు అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ వార్డు అధికారులు వార్డులలో ఇంటింటికీ తాగునీరు సరఫరా అవుతుందా, సమస్యలు ఉన్నాయా అనే వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. ట్యాంకుల నుంచి ఇళ్లకు సరఫరా అయ్యే పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏఈలు సాయికిరణ్, సరిత, శానటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

మంచిర్యాలటౌన్: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. సమావేశానికి పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మంథని ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్‌బాబు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ధర్మపురి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తోపాటు పెద్దపల్లి కాంగ్రెస్‌అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ హాజరవుతారని వివరించారు.

‘బార్ల మామూళ్ల’పై ఆరా!

• చర్చనీయాంశంగా సాక్షి కథనం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా కేంద్రంలో బార్ల యాజమానుల నుంచి మామూళ్ల కోసం ఒత్తిడి తెస్తున్న తీరుపై శనివారం ‘సాక్షి’లో ప్రచురితమైన ‘బార్లపై మాముళ్ల ఒత్తిడి’ కథనంపై పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీశారు. దీనిపై ఇంటలిజెన్స్ అధికారులు సైతం వివరాలు తీసుకున్నారు. ఒకరిద్దరు బార్ల యాజమానులను సైతం కలిసి ఈ మేరకు సమాచారం సేకరించారు. శాఖ పరంగా తదుపరి విచారణ చేపట్టేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన పాస్టర్లు



దీపక్‌జాన్‌కు బొకే ఇస్తున్న పాస్టర్లు

మంచిర్యాలటౌన్: రాష్ట్ర క్రిస్టియన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌ను జిల్లాకు చెందిన పాస్టర్లు హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించిన జిల్లా పాస్టర్స్, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సంబంధించిన పలు పథకాల విధివిధానాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఐపీఎంఆర్ ప్రెసిడెంట్ పాస్టర్ శ్యాముల్, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ కొంద్ర, సెక్రెటరీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాసుల కక్కుర్తి!

• కరోనా సమయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి మృతదేహాన్ని సొంతూరుకు తరలించేందుకు ఓ అంబులెన్సు డ్రైవర్ ఏకంగా రూ.80వేలు అడిగారు. అంత డబ్బులు చెల్లించలేక తన తమ్ముడి శవాన్ని ప్రభుత్వాసుపత్రిలోనే ఉంచి వెళ్లిపోతే, ఇక్కడే అంత్యక్రియలు చేశారు.

• మార్చి 29న ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. మొదట జిల్లా ఆసుపత్రికి, తర్వాత ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అటు నుంచి కరీంనగర్‌కు అంబులెన్సులో వెళ్లారు. అక్కడ డ్రైవర్, మొదట తనకు కమీషన్ ఎక్కువ ఇచ్చే ఆసుపత్రి, తర్వాత మరో ఆసుపత్రికి వెళ్లారు. బాధితురాలికి చికిత్స అందడంలో జాప్యం జరిగి పరిస్థితి విషమించిందని అక్కడి వైద్యులు చెప్పారు. చివరకు బ్రెయిన్ డెడ్ కావడంతో మళ్లీ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. రెండు రోజుల క్రితం మృతిచెందింది. ఈ ఘటనలో అంబులెన్స్ డ్రైవర్‌పై కేసు నమోదైంది.

• రోగిని క్యాష్ చేసుకుంటున్న ‘ప్రైవేట్’ అంబులెన్సుల డ్రైవర్లు
• ఆసుపత్రుల నిర్వాహకులతో కమీషన్ ఒప్పందాలు
• తమ జేబులు నింపే చోటుకు రిఫరల్ కేసులు
• జిల్లాలో అదుపుతప్పిన అంబులెన్సుల వ్యవస్థ



జిల్లా ప్రభుత్వాసుపత్రి ముందున్న అంబులెన్సులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అంబులెన్స్ అంటేనే ఆపద్బాంధవిగా భావిస్తారు రోగులు, వారి బంధువులు. అంబులెన్స్ వచ్చిందంటే విషమ పరిస్థితిలో ఉన్న వారు, ఇక ఆస్పత్రికి చేరినట్లే అని అనుకుంటారు. తాము క్షేమంగా బయటపడతామన్న భరోసాతో ఉంటారు. అయితే జిల్లాలో మాత్రం ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్లు రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. తమ జేబులు నింపుకునేందుకు రోగుల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఇటీవల జరిగిన ఘటనలు జిల్లాలో ప్రైవేటు అంబులెన్సు డ్రైవర్ల కాసుల కక్కుర్తికి అద్దంపడుతోంది. జిల్లాలో సుమారు 175 ప్రైవేట్ అంబులెన్స్‌లు ఉంటే, రవాణా శాఖ నుంచి ఫిట్‌నెస్ పొందినవి 92 ఉన్నాయి. కొన్ని పనికి రాకుండా పోగా, మరో 20 అంబులెన్స్‌లు ఫిట్‌నెస్ లేకుండానే రోడ్లపై తిరుగుతున్నాయి.

‘రిఫరల్’ కేసులో పిండుడే..!

జిల్లా ఆసుపత్రి నుంచి రోజుకు 8 నుంచి 15 కేసుల వరకు ఇక్కడ చికిత్స ఇవ్వలేమని మెరుగైన వైద్యం కోసం వైద్యులు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ ఆస్పత్రులకు పంపిస్తున్నారు. ఇక జిల్లాలో 108 అంబులెన్స్‌లు 13 ఉన్నాయి. ఎక్కువగా ఇవి మండల కేంద్రాల్లో ఉంటాయి. పేదలు ఇప్పటికీ 108లోనే కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వరకు తీసుకెళ్తున్నారు. జిల్లా ఆసుపత్రిలోనూ రెండు వాహనాలు ఉన్నా, పరిమితంగా సేవలు అందిస్తున్నాయి. ఇదే అదునుగా ఇక్కడే కాచుకున్న ప్రైవేటు అంబులెన్సు డ్రైవర్లు రిఫరల్ కేసు రాగానే, డబ్బులు గుంజే పనిలో ఉంటున్నారు. వైద్యులు సూచించిన ఆస్పత్రులకు కాకుండా తమకు ఎక్కువ కమీషన్ ఇచ్చే ఆస్పత్రులకు రోగులను తీసుకెళ్తున్నారు. ఇందుకు రోగుల బంధువులను డైవర్ట్ చేస్తున్నారు.

ఎవరైనా నడుపొచ్చా?

వాహనం కొనుక్కుని ఎవరికి వారు అంబులెన్సు నడుపుకుంటున్నారు. ఈ వ్యవస్థపై పర్యవేక్షణ చేసే అధికారే లేరు. వాహన ఫిట్‌నెస్ మాత్రం రవాణా శాఖ నుంచి ఇస్తున్నారు. ఆక్సిజన్, వెంటిలేటర్ ఉండే వాహనంలో కనీస పరిజ్ఞానం ఉన్న నిపుణులు ఉన్నారా? ఆపత్కాలంలో బాధితులను తరలించేప్పుడు ప్రాథమిక చికిత్సపై అవగాహన ఉందా? అని ప్రైవేటు అంబులెన్సులను నియంత్రించే వారే లేరు. 108 వాహనాలు నడిపే పైలెట్లు శిక్షణ పొందుతారు. వాహనంలో నిపుణులు ఉంటారు. సిబ్బందిపై జిల్లా మేనేజర్ పర్యవేక్షణ ఉంటుంది. ప్రైవేటు అంబులెన్సులకు కేవలం డ్రైవర్‌గా ఉంటే చాలనే పరిస్థితి ఉంది. సీరియస్ రోగులను వెంటిలేటర్‌పై తీసుకెళ్లేప్పుడు మాత్రం ప్రైవేటు ఆసుపత్రుల్లో పని చేసే ఎవరినైనా వెంట తీసుకెళ్తున్నారు. ఇక జిల్లాతోపాటు ఆసిఫాబాద్, మహారాష్ట్ర నుంచి వచ్చే రోగులు, అవగాహన లేని వారి నుంచి చార్జీలు ఒక్కోతీరుగా వసూళ్లు చేస్తున్నారు. గతంలో ఏసీపీ అఖిల్ మహాజన్, ఇటీవల ప్రస్తుత ఏసీపీ ఆర్.ప్రకాశ్ అంబులెన్స్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా కొందరిలో మార్పు రావడం లేదు.

నాటి డ్రైవర్లే నేటి ఆసుపత్రుల నిర్వాహకులు..

ఇక విచిత్రం ఏమిటంటే గతంలో అంబులెన్సు డ్రైవర్లుగా పని చేసినవారు ఇప్పుడు రూ.కోట్లలో పెట్టుబడి పెట్టి ఆసుపత్రులను నెలకొల్పే స్థాయికి ఎదిగారు. సర్కారు ఆసుపత్రికి ఎమర్జెన్సీ కేసు ఏది వచ్చినా క్షణాల్లో తెలుసుకుని, రంగంలోకి దిగుతున్నారు. అక్కడి సిబ్బంది సాయంతో రోగులను తమ ఆస్పత్రులకు తరలిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. ఈ వ్యవహారాలపై జిల్లా వైద్యారోగ్యాధికారి సుబ్బారాయుడు సంప్రదించగా, అంబులెన్సు నిర్వాహకులపై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. ప్రైవేటు అంబులెన్సుల పర్యవేక్షణ తమ పరిధిలో లేదని తెలిపారు.

అనుమతి లేకుండా వైద్యం చేస్తే చర్యలు

• మూడు ఆస్పత్రులు తనిఖీ చేసిన టీఎస్ఎంసీ సభ్యులు



తనిఖీ చేస్తున్న టీఎస్ఎంసీ సభ్యులు

మంచిర్యాలటౌన్: ఇష్టారీతిన ఆసుపత్రులు ఏర్పాటు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా వైద్యం చేస్తే చర్యలు తప్పవని తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్(టీఎస్ఎంసీ) సభ్యులు హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని చంద్ర, అమృత, లోటస్ ఆసుపత్రులను హైదరాబాద్ నుంచి వచ్చిన డాక్టర్ చరణ్, కరీంనగర్ నుంచి వచ్చిన డాక్టర్ రాజ్‌కుమార్, ఉమ్మడి జిల్లా మెంబర్, లీగల్ అండ్ యాంటి క్వాకరీ మెంబర్ డాక్టర్ ఎగ్గన శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఆసుపత్రి అనుమతులు ఒకటైతే, చేసే వైద్యం మరోటిగా ఉండడం, ఆసుపత్రి బోర్డుల్లో ఉండే వైద్యులు, ఆసుపత్రులో వైద్యం అందించే వారు వేర్వేరుగా ఉండడం, అర్హతలు లేకుండానే ఇష్టారీతిన వైద్య చికిత్స అందించడం, యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్‌ను అందించడం వంటివి చేస్తున్నట్లు గుర్తించామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా కలెక్టరేట్, పోలీసు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి టీఎస్ఎంసీ ఆధ్వర్యంలో తనిఖీలు చేసి, రిపోర్టు తయారు చేయడం జరిగిందని తెలిపారు. ఆయా ఆసుపత్రులను సీజ్ చేయడంతోపాటు, కేసులు నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు ఉగాది కవిసమ్మేళనం

మంచిర్యాల అర్బన్: స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం జిల్లా సాహితీ సంరక్షణ సమితి, సంగీత సాహిత్య సుధా వాహిని ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు శ్రీనాథ్‌గౌడ్, వామన్‌రావు తెలిపారు. కవయిత్రి అడ్డగూరి శ్రీలక్ష్మి అంతస్మితం గేయ సంపుటి అవిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. కవులు, రచయితలు హాజరుకావాలని కోరారు.

నిలిచిన గూడెం ఎత్తిపోతలు



గూడెం ఎత్తిపోతల పంప్‌హౌస్

• ఆలస్యంగా పంటసాగు చేసిన రైతులకు ఇబ్బందే

దండేపల్లి: కడెం ఆయకట్టు పరిధిలో ఈ ఏడాది యాసంగి పంటలకు క్రాప్ హాలీడే ప్రకటించారు. అయితే ఆయకట్టు పరిధిలోని డి–30 నుంచి 42 వరకు మాత్రం దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఎత్తిపోతల ద్వారా సుమారు 15,600 ఎకరాలకు సాగు నీరందించాలని నిర్ణయించారు. దీంతో ఈఏడాది జనవరి 6 నుంచి ఏప్రిల్ 3 వరకు నిరంతరాయంగా సాగునీటిని సరఫరా చేశారు. గోదావరిలో నీరు అడుగంటడంతో ఎత్తిపోతలు నిలిపి వేశారు. దీంతో ఆలస్యంగా వరి వేసిన రైతులు నీరు అందే అవకాశం లేదు.

నీటి విడుదల ఇలా..

మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఎత్తిపోతల ద్వారా దండేపల్లి మండలంలోని డి–30 నుంచి లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల(డి–42) వరకు సుమారు 15,600 ఎకరాలకు 1.708 టీఎంసీల నీటిని అందించారు. గూడెం ఎత్తిపోతల నీటి విడుదలకు ముందు జిల్లా కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి గూడెం ఎత్తిపోతల ద్వారా జనవరి 6 నుంచి మార్చి 31 వరకు 1.5 టీఎంసీల నీరు మాత్రమే అందించాలని నిర్ణయించారు. కానీ అనుకున్నదానికంటే ఎక్కువగా ఏప్రిల్ 3 వరకు 1.708 టీఎంసీల నీటిని అందించారు. అయినా ఆలస్యంగా వేసిన పంటలు ఇంకా చేతికి రాలేదు. నీటి ఎత్తిపోతలు నిలిపివేయడంతో ఆ పంటలకు నీరు అందడం కష్టమే.

తాగునీటి తీవ్రత దృష్ట్యా..

రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ప్రాజెక్టుల్లో కూడా నీరు ఇంకిపోతోంది. ప్రభుత్వం సాగునీటికంటే, తాగునీటికి ప్రాధాన్యం ఇస్తుంది. సాగునీటి సరఫరాను నిలిపివేసి, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ పథకాలతోపాటు హైదరాబాద్‌కు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మండుతున్న ఎండలకు ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు తగ్గుముఖం పట్టాయి, ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులో 7.57 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. దీంతో గూడెం ఎత్తిపోతల ద్వారా సాగునీటి నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

గొలక దశలో వరి..

అనుకున్న సమయంలో సాగు చేసిన వరి పంట కొన్నిచోట్ల కోతకు వచ్చింది. ఆలస్యంగా సాగు చేసిన వరి మాత్రం గొలక దశలోనే ఉంది. వాటికి ఇంకా ఒకటి, రెండు తడులు అవసరం. నీటి లిఫ్ట్ నిలిపివేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఒక్కసారి ఆలోచించి ఒకటి, లేదా రెండు తడులకు నీరందించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే..

రాష్ట్రంలో ఎండలు మండి పోవడం, సాగు, తాగునీటి సమస్యలు తలెత్తుతుండడంతో సాగునీటికంటే తాగునీటికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. గూడెం ఎత్తిపోతల ద్వారా అనుకున్న దానికంటే ఎక్కువే సాగునీటిని అందించడం జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగు నీటి సరఫరాను నిలిపివేశాం.

– స్వామి, ఈఈ, ఎల్లంపల్లి ప్రాజెక్టు

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

• కలెక్టర్ బదావత్ సంతోష్



బోరు నీరు తాగుతున్న కలెక్టర్ సంతోష్

భీమారం/చెన్నూర్‌రూరల్: వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. భీమారం మండలం ఆరెపల్లి, కొత్తపల్లి, ఎలకేశ్వరం, చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామాల్లో శనివారం పర్యటించారు. తాగునీటి సరఫరా చర్యలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం ద్వారా జిల్లాలోని ప్రతీఇంటికి వేసవికాలం పూర్తయ్యే వరకు తాగునీరు సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు, మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికీ తాగునీరు సరఫరా చేసేలా కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని వెల్లడించారు. నీటిసరఫరాలో సమస్యలు తలెత్తితే త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. మిషన్‌భగీరథ నీటిసరఫరాపై ప్రతీరోజు నివేదిక అందించాలన్నారు. పైప్‌లైన్ల లీకేజీలకు, బోర్‌వెల్ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. కొత్తపల్లి గ్రామంలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నందున గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం ఎలకేశ్వరంలోని హరితహారం నర్సరీని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి చిన్నయ్య, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవోలు రాధ రాథోడ్, మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ విద్యాసాగర్, సరిత పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాజెక్టు



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, అధ్యాపకులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ విద్యార్థులు హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. కళాశాల తరఫున తయారు చేసిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికయిందని పేర్కొన్నారు. చెన్నూర్ చరిత్ర, సాంఘిక జీవన ఆర్థిక విధానంపై పరిశోధన చేసి మొదటిసారి చెన్నూర్ పట్టణం పూర్వ వైభవాన్ని ప్రస్తుత జీవన విధానాన్ని రాష్ట్రస్థాయి వేదికపై ప్రదర్శించారు. అధ్యయనంలో భాగంగా విద్యార్థులు 30 రోజులుగా వివిధ చారిత్రాత్మక కట్టడాలను సందర్శించారు. వివిధ చేతి వృత్తుల వారిని కలిసి వారి నుంచి సమాచారం సేకరించారు. అలాగే సాహితీవేత్తలు, సంగీత కళాకారులు, వరదాచార్యలు గురించి సమాచారం సేకరించారు. జనాభా, పంటల సమాచారం, ఉద్యోగాల కల్పన, జాతీయస్థాయి అవార్డులు అందుకున్న వారి గురించి ప్రాజెక్టును సమర్పించి, ప్రదర్శించడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఈ ప్రాజెక్టులో హిస్టరీ అధ్యాపకురాలు శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులు మేఘన, అక్షిత, రవికిరణ్, సంపత్, రిమిన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

మంచిర్యాలఅర్బన్: ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఆదివారం పరీక్ష ఉంటుందని డీఈవో యాదయ్య తెలిపారు. మోడల్‌స్కూళ్లలో 7 నుంచి 10 వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 6వ తరగతి ప్రవేశ పరీక్షకు ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. దండేపల్లి మండలం లింగాపూర్, కాసిపేట్, మందమర్రి కార్మెల్ హైస్కూల్, ఎస్‌సీహెచ్ఎస్, మంచిర్యాల రాజీవ్‌నగర్ మోడల్ స్కూల్, బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోటపల్లి మోడల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 1,358 మంది, ఏడో తరగతిలో 511 మంది విద్యార్థులు, 8వ తరగతికి 405 మంది, 9వ తరగతికి 185 మంది, పదో తరగతిలో 54 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతులు, పశు పోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు వై.రమేష్‌తో కలిసి ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ టీకాలు వేసి ప్రతీ పశువుకు గుర్తింపు చేవిపోగు వేసి వివరాలను భారత్ పశుదాన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత టీకాలను రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సి సెక్షన్ పర్యవేక్షకులు సంతోష్, పశు సంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలన రైతులకు శాపం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, పక్కన కొప్పుల ఈశ్వర్, బాల్క సుమన్

• బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

మంచిర్యాలటౌన్/చెన్నూర్/బెల్లంపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ పాలన రైతుల పాలిట శాపంగా మారిందని, రైతులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ మంచిర్యాల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో, చెన్నూర్‌లో పాత తహసీల్దార్ ఆఫీస్ ఎదుట, బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలో బీఆర్ఎస్ నాయకులు శనివారం రైతు నిరసన దీక్ష చేపట్టారు. మంచిర్యాల, చెన్నూర్‌లో చేపట్టిన దీక్షలో కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పాల్గొనగా, బెల్లంపల్లిలో మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య పాల్గొన్నారు. మాజీ మంత్రి మాట్లాడుతూ వరికి రూ.500 బోనస్, రైతుల రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సాగునీరు అందక 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో 200 మంది రైతులు చనిపోయారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పొలం బాట పడితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి క్రికెట్ చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆగర్భ శ్రీమంతుడు వంశీ, భూగర్భ కార్మికుడు కొప్పుల ఈశ్వర్ మధ్య పోటీ ఉంటుందని బాల్క సుమన్ అన్నారు. కోటీశ్వరుడు కావాలో, సామాన్యుడు కావాలో ఆలోచించుకోవాలని సూచించారు. బెల్లంపల్లిలో మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రైతు రుణమాఫీ, కౌలు రైతులకు పెట్టుబడి సాయం, మహిళలకు రూ.2,500 సాయం, పెన్షన్ రూ.4 వేలకు పెంపు హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ టి.సత్యనారాయణ, బెల్లంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పట్టణ బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ ఎస్.సత్యనారాయణ, అధికార ప్రతినిధి కొమ్మెర లక్ష్మణ్, నాయకులు రాజారమేశ్, చెన్నూర్ ఎంపీపీ మంత్రి బాపు, వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో ఉద్రిక్తత..

చెన్నూర్: చెన్నూర్‌లో తలపెట్టిన రైతు దీక్షలో ఉద్రిక్తత నెలకొంది. దీక్ష స్థలిలో వేసిన టెంట్‌కు అనుమతి లేదంటూ పోలీసులు తొలగించారు. ఆర్వో నుంచి అనుమతి వస్తుందని, తొలగించవద్దని బీఆర్ఎస్ శ్రేణులు చెప్పినా వినలేదు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. అయినా టెంటు లేకుండానే దీక్ష చేపట్టారు. ఆర్వో నుంచి అనుమతి వచ్చిన తర్వాత టెంటు వేసుకుని దీక్ష కొనసాగించారు. రైతు దీక్షను అడ్డుకునేందుకు అనుమతి ఇవ్వడంలో జాప్యం చేసిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఆరోపించారు.

క్లుప్తంగా

ఐదు ఎడ్లు చోరీ

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని షేక్ అహ్మద్‌గూడ కాలనీకి చెందిన ముగ్గురు రైతుల ఐదు వ్యవసాయ ఎడ్లు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. షేక్ అహ్మద్ గూడ కాలనీకి చెందిన బోర్కుటే మోహన్ అనే రైతుకు చెందిన రెండు ఎడ్లు, బోర్కుటే ప్రకాష్‌కు చెందిన రెండు ఎడ్లు, దంద్రె పోశంకు చెందిన ఒక ఎద్దు మంగళవారం మేతకు వెళ్లి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల గ్రామాల్లో గాలించినా దొరకలేదు. దీంతో రైతులకు చెందిన 5 ఎడ్లను మేతకు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పశువులను దొంగలించినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు.

త్వరలో మ్యాన్‌రైడింగ్..!



పనులు పరిశీలిస్తున్న అధికారులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిలో మ్యాన్‌రైడింగ్ పనులు పూర్తి కాగా ట్రయల్ దశలో ఉండడంతో పాటు మరో వారం రోజుల్లో మ్యాన్‌రైడింగ్ ప్రారంభం కానుండడంతో గని కార్మికుల కష్టాలు తీరనున్నాయి. గని 17వ లెవల్ వరకు పని స్థలాలు ఉండడంతో ఇప్పటి వరకు కార్మికులు కాలినడకన వెళ్తున్నారు. కార్మికుల సమస్య పరిష్కరించడంతో పాటు ఉత్పత్తిని మెరుగుపర్చేందుకు యాజమాన్యం మ్యాన్ రైడింగ్ ఏర్పాటుకు సిద్ధమైంది. కేకే–1కు సంబంధించిన మ్యాన్‌రైడింగ్‌ను కాసిపేట–2 గనికి షిఫ్ట్ చేసి రూ.3.8 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం 800 మీటర్ల దూరం 14వ లెవల్ వరకు మ్యాన్‌రైడింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో కార్మికులకు శారీరకంగా, మానసికంగా ఉల్లాసం ఉండడంతో పాటు డిస్ట్రిబ్యూషన్‌కు గనిలోకి దిగేందుకు సమయం ఆదా అవుతుంది. ఆ సమయంలో ఉత్పత్తి సైతం మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి. 720 మంది కార్మికులు ఉన్న ఈ గనిలో 97శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోగా మ్యాన్‌రైడింగ్‌తో పాటు ఇతర సమస్యల పరిష్కారంతో అనుకున్న లక్ష్యం చేరుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీంతో సంస్థకు, కార్మికులకు ప్రయోజనం చేకూరనుందని కేకే గ్రూపు ఏజెంట్ రాందాస్ తెలిపారు.

భక్తిమార్గంలో యువత



సంత్ సేవాలాల్ మహరాజ్



అనార్‌పల్లి పూజల్లో పాల్గొన్న భక్తులు

సండే స్పెషల్

ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తండాలు భక్తి భావంలో ఫరిడవిల్లుతున్నాయి. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ఆలయాల్లో ప్రత్యేక పూజలతో బంజార సోదరులు తరించిపోతున్నారు. సేవాలాల్ దీక్ష భూమిని భక్తులు నియమనిష్టలు పాటిస్తూ తరించిపోతున్నారు. ముఖ్యంగా యువత ఈసారి అత్యధిక మంది దీక్షను చేపట్టారు. నాడు ప్రేమ్‌సింగ్ మహరాజ్ చేపట్టిన దీక్ష నేడు ప్రతీ తండాల్లో విస్తరించింది. కొద్దిరోజులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నిర్ణయించిన భక్తులు సేవాలాల్ దీక్షను చేపట్టారు. శ్రీరామ నవమిన మహరాష్ట్రలోని పోహరాదేవిలో దీక్ష విరమించనున్నారు. దీనిపై సాక్షి ప్రత్యేక కథనం..

- తండాల్లో పెరుగుతున్న భక్తిభావం
- సేవాలాల్ నామస్మరణలో గ్రామాలు
- 756 తండాల్లో 31వేల మంది సేవాలాల్ భక్తులు
- దీక్షలపై ఆసక్తి చూపుతున్న యువత
- నానాటికీ పెరుగుతున్న భక్తి భావం
- శ్రీరామ నవమితో ముగింపు



జగదంబాదేవికి పూజలు చేస్తున్న పుజారి

కెరమెరి(ఆసిఫాబాద్): కొద్దిరోజులైన చాలు భక్తి భావంతో మెలుగుతూ.. కులగురు అయిన సేవాలాల్ మహరాజ్ లీలా గానంలో లీనమైపోవాలన్న లంబాడ(బంజార) ప్రజలు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. కఠోర దీక్ష.. కఠిన నియమాలు అవలంభిస్తున్నారు. 1979లో మహతపస్వీ, దీక్ష గురువైన ప్రేంసింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో 1600 మందితో నార్నూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ప్రారంభమైన ఈ దీక్ష 45 ఏళ్లుగా కొనసాగిస్తున్నారు. ప్రతీ సంవత్సరం భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది. మహాశివ రాత్రి నుంచి ప్రారంభమై శ్రీరామనవమి వరకు ఈ దీక్షలు కొనసాగుతాయి. మరో పది రోజుల్లో దీక్షలు ముగియనున్నాయి. 11, 21, 41 రోజులు దీక్షా కాలంగా స్వీకరించవచ్చు. ఆడ, మగ, చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఈ దీక్షలు స్వీకరించారు.

31వేల మంది సేవాలాల్ భక్తులు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ మండలాల్లోని 756 తండాల్లో సుమారు 31వేల మంది సేవాలాల్ భక్తులు ఉన్నారు. ఇందులో యువకులే అధికం. సుమారు 20వేల మంది యువకులు (18–40) ఈ ఏడాది దీక్షలు స్వీకరించినట్లు తెలుస్తోంది. ఇందులో మధ్యవయస్కులు, వృద్ధులు సుమారు 6వేలు, మహిళలు, చిన్నారులు 5వేల మంది దీక్షలు స్వీకరించారు. అయితే అధికంగా 11 రోజుల దీక్షను స్వీకరించారు. చెప్పులు లేకుండా నడవాలనేది దీక్షలో నియమం. దీక్షాపరులు కేవలం రోజుకు ఒకపూట భోజనమే చేస్తారు. పండ్లు, ఫలహారాలు తీసుకోవచ్చు.

శ్రీరామ నవమికి దీక్షా విరమణ..

మహారాష్ట్రలోని యవత్‌మాల్ జిల్లాలోని పోహరాదేవి గ్రామంలో కొలువైన జగదంబాదేవి సమక్షంలో దీక్ష విరమణ చేస్తారు. శ్రీరామనవమి రోజున జిల్లాలోని సేవాలాల్ భక్తులు అందరు పోహరాదేవికి బయలుదేరి వెళ్తారు. అక్కడే దీక్షలు విరమిస్తారు. దీక్షలు విరమించే మరో చోటు ఎక్కడా లేదు. దీక్షా స్వీకరించిన ప్రతి భక్తుడు పోరాదేవి వద్దకు వెళ్లాల్సిందే.

25ఏళ్లుగా దీక్ష స్వీకరణ



నేను 25ఏళ్లుగా సేవాలాల్ దీక్ష స్వీకరిస్తున్నాను. దీక్షా తీసుకున్నప్పటి నుంచి అంతా మంచే జరుగుతుంది. ప్రతి సంవత్సరం 41 రోజులు దీక్షలోనే ఉంటాను. కష్టాల్లో ఉన్న నేను నా కుటుంబం ప్రస్తుతం హాయిగా జీవిస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులు తొలిగిపోతున్నాయి. – సున్నాబాయి, కెరమెరి

మనస్సుకు ప్రశాంతత



27ఏళుగా సేవాలాల్ దీక్షా స్వీకరిస్తున్నాను. యువతలో భక్తి భావం ఎక్కువ కనిపిస్తుంది. దేవుడిని పూజిస్తే అంతా మంచి జరుగుతుంది. దీక్షలో చక్కటి లక్షణాలు అవడతాయి. ప్రతి ఒక్కరు దీక్ష చేపడితే కొద్ది రోజులైనా మంచి అలవాట్లు అలవడుతాయి.
–జాదవ్ వస్రాం, అనార్‌పల్లి, పుజారి

కోరికలు నెరవేరాయి



నేను ఈ సంవత్సరం ప్రథమ సారిగా దీక్ష స్వీకరించాను. గతంలో నా తండ్రి దీక్ష చేసేవారు. అప్పుడే నా మనసులోని కోరికలు నెరవేరితే దీక్ష స్వీకరిస్తానని సేవాలాల్‌ను కోరారు. నా ఆశయం నెరవేరింది. ఉద్యోగంలో చేరాను. కొద్ది రోజులైనా నియమనిష్టలతో ఉండాలని నిశ్చయించుకున్నాను.
– అజ్మీర పవన్, రెబ్బెన

'కార్మికుల వేతనాలు పెంచడంలో విఫలం'



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్

రెబ్బెన(ఆసిఫాబాద్): కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచడంతో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం గోలేటి బ్రాంచి నూతన కమిటీని ఎన్నుకోగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా అన్ని విభాగాల్లో పని చేసే కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కనీస వేతనాల జీవోలను గెజిట్ చేయటం ద్వారా కార్మికుల వేతనాలు పెరుగుతాయని అన్నారు. 2006 నుండి రాష్ట్ర ప్రభుత్వం వేతనాలను పెంచకపోవటంతో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. కార్మికుల పోరాటాల ఫలితంగా బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో కనీస వేతనాలకు సంబంధించి జీవోలు విడుదల చేసిన వాటిని గెజిట్ చేయటంలో కాలయాపన చేసిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఉన్న వేతనాల కంటే తగ్గించే విధంగా జీవోలను తీసుకురావటం కార్మికులను, వారి శ్రమను అవమానించటమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం 2022 జనవరిలో జీవో గడువు ముగిసిన నేటికి కొత్త జీవోను తీసుకురాకుండా కార్పొరేట్ సంస్థకు అనుకూలంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఇకనైనా ప్రభుత్వాలు పట్టించుకుని కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఓదెలు, జంగు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్..



మంచినీటి బావిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

దండేపల్లి: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అదనపు కలెక్టర్, తాగునీటి సరఫరా జిల్లా నోడల్ అధికారి రాహుల్ సూచించారు. దండేపల్లి మండలం తాని మడుగు, బేరస్‌గూడ గ్రామాలను శనివారం సందర్శించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. బావుల నీటిని తాగేందుకు వినియోగిస్తే కాచి, చల్లార్చి తాగాలని సూచించారు. మిషన్ భగీరథ నీళ్లు అందని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అతనంతరం ఉపాధి పని ప్రదేశాలను సందర్శించి కూలీలతో మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉండటంతో, ఉదయం వేళలోనే పనులు చేయాలన్నారు. తర్వాత దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సదంర్శించారు. రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ శిరీష, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

వడదెబ్బతో కూలీ మృతి

కౌటాల: మండలంలోని గురుడుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని యాపలగూడ గ్రామానికి చెందిన గంథం శ్యాంరావు(40) వడదెబ్బతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామ శివారులో చేపడుతున్న ఉపాధి హామీ పనులకు శ్యాంరావు మూడు వారాలుగా వెళ్తున్నాడు. గత నెల 28న ఉపాధి హామీ పనులకు వెళ్లి ఇంటికి వచ్చి అస్వస్థతకు గురయ్యాడు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆరోగ్యం విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు.

సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య



రాజేష్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాలకు చెందిన సింగరేణి ఉద్యోగి చింతకింది రాజేష్(38) అనారోగ్యంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుబ్బారావ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... రాజేష్ ఆర్‌కే 6 మైన్‌లో పని చేస్తున్నాడు. కొంత కాలంగా తీవ్రమైన తల నొప్పితో ఆస్పత్రులకు వెళ్లినా నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజేష్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాలప్డాడు. రాజేష్‌కు భార్య జ్యోతి, కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



నీలయ్య (ఫైల్)

బెజ్జూర్: మండలంలోని నాగులవాయి గ్రామానికి చెందిన చెడే నీలయ్య (42) మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో శనివారం ఉదయం గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై విక్రం తెలిపిన కథనం ప్రకారం.. మద్యం మత్తులో పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆయన పరిస్థితి నితిమించడంతో సిర్పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో మరణించాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పరామర్శ..

బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్, బీఎస్పీ, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు పరామర్శించారు. సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్షద్ హుస్సేన్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు లెందుగురి శ్యామ్ రావు తదితరులు బాధిత కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

బైక్ మాయంపై కానిస్టేబుల్ ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పోలీసు స్టేషన్ పరిధిలోనే ఓ కానిస్టేబుల్ బైక్ కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. పెద్దపల్లి జిల్లా ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ ఎస్.మహేందర్ గత అక్టోబర్‌లో జన్నారం బదిలీపై వచ్చాడు. గత డిసెంబర్‌లో ఆయన ఓ పాత బైక్‌ను రూ.3వేలకు కొనుగోలు చేసి, జన్నారంలో తన క్వార్టరు వద్ద ఉంచాడు. గత ఫిబ్రవరిలో మహేందర్ సెలవుల్లో వెళ్లడం, తర్వాత ఎన్నికల చెక్‌పోస్టు డ్యూటీలకు వెళ్లాడు. ఆయన తిరిగి వచ్చాక ఆ బైక్ కనిపించలేదు. దీనిపై ఆరా తీయగా, స్టేషన్‌లోనే పని చేసే స్వీపర్ వెంకటేశ్, హోంగార్డు శ్రీనివాస్ కలసి బైక్‌ను అమ్ముకున్నారని ఆరోపిస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై సతీశ్‌కు ఇదంతా తెలుసని, ఓ వీడియో విడుదల చేశాడు. దీనిపై జన్నారం నుంచి మంచిర్యాల సీసీఎస్‌కు బదిలీపై వచ్చిన ఎస్సై సతీశ్ వివరణ కోరితే, తనకు ఆ బైక్ అమ్ముకోవడంపై ఎలాంటి సంబంధం లేదన్నారు. పాత బైక్ విక్రయించాలని ఎవరికీ చెప్పలేదన్నారు.

అగ్నిప్రమాదాల నివారణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

జైపూర్: అడవిలో అగ్నిప్రమాదాలు సంభవిస్తే జంతువులు, మొక్కలకు అక్కడున్న జీవజాతికి ప్రమాదం జరుగుతుందని, అగ్నిప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని డిప్యూటీ రేంజర్ సాగరిక తెలిపారు. మండలంలోని దుబ్బపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశువుల కాపర్లు, రోడ్లపైన వెళ్లే వారు సిగిరెట్, బీడీలను కాల్చి పడేయటం, వంటను చేసుకుని తర్వాత ఆ మంటను ఆర్పేకపోవడంతో చిన్నచిన్న నిప్పురవ్వ గాలిలో కలిసి వేద జల్లుతే అడవిలో అంతకాలిపోతుందన్నారు. మీకు దగ్గరలో చిన్నగా ఆడవిలో మంట కనిపిస్తే వెంటనే ఆర్పివేయాలని, ఒక్కవేళ పెద్దగా మంటలు ఉంటే వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఒక్క చిన్న నిప్పుకనికను ముట్టిన ఇప్పుడున్న ఎండకు మనుషలను తట్టుకోలేక పోతున్నామని అలాంటిది అడవి కాస్త అగ్నికి అహుతి అయితే అక్కడ ఉన్న పక్షులు, జంతువులు, చెట్లు చెమలు ఏ విధంగా ఇబ్బంది పడుతాయో వీరే ఆలోచించండీ అంటూ అవగాహన కల్పించారు. అనంతకం కూలీలకు మజ్జిగ ప్యాకెట్స్ అందించారు. ఇందులో ఎఫ్‌బీవో దీక్ష, టీఏ స్మృతి ఉన్నారు.

గుట్టుగా బొగ్గు దందా...


- గోదావరి ఒడ్డున కట్టెలు కాల్చి బొగ్గులు తీస్తున్న వైనం
- పట్టణాలకు బొగ్గు రవాణా
- అటవీశాఖ అధికారుల దాడిలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి



పట్టుబడిన బొగ్గులు రవాణా చేస్తున్న ట్రాక్టర్

జైపూర్: అక్రమార్కులు వేటిని వదలటం లేదు. అక్రమ సంపాధనే ధ్యేయంగా గోదావరి ఒడ్డున గుట్టు చప్పుడు కాకుండా బొగ్గుల దందా సాగిస్తున్నారు. గోదావరి ఒడ్డున కర్రలను కాల్చి వాటి నుంచి బొగ్గులను తీసి పట్టణాలకు రవాణా చేస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇటీవల అటవీశాఖ అధికారులు జరిపిన దాడుల్లో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కట్టెలు కాల్చి వాటి నుంచి తీసి పట్టణాలకు తరలిస్తున్న బొగ్గు ట్రాక్టర్‌ను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌లో తరలిస్తున్న బొగ్గు ట్రాక్టర్ విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుంది అంటే దందా ఎంతటి స్థాయిలో నడిపిస్తున్నారో అర్థం అవుతోంది. జైపూర్ మండలం ఇందారం, రామారావుపేట శివారు అంతా గోదావరి ఒడ్డు పొడుగునా విస్తరించివుంటుంది. గ్రామాలకు దూరంగా గోదావరి ఒడ్డున ఏవరి కంతపడకుండా గుట్టుగా అక్రమార్కులు పలు రకాల వ్యాపారాలు చేస్తున్నారు. కొంత మంది అక్రమంగా ఇసుక రవాణా సాగిస్తూ సొమ్ము చేసుకుంటుండగా మరికొంత మంది గోదావరి నదిలో కొట్టుకొచ్చిన కట్టెలు, గోదారి ఒడ్డున ఉన్న చెట్లను కొట్టి వాటిని కాల్చివాటి నుంచి బొగ్గులు తీసుకున్నారు. ఆ బొగ్గులను పట్టణాల్లో విక్రయించి డబ్బులు దండుకుంటున్నారు. బట్టలు ఐరాన్ చేయడానికి వినియోగిస్తుండడం వీటికి డిమాండ్ ఉండడంతో కొంతమంది ఇదే పనిగా దందా సాగిస్తున్నట్లుగా తెలుస్తోంది. అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించి రామారావుపేట శివారులో బొగ్గులు తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు.

ఐదు సాధారణ బోగీలు ఉండాలి



ఉత్తరాలను పంపిస్తున్న వారితో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్: ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలు ఉండాలని డిమాండ్ చేస్తూ ప్రధాన మంత్రికి దేశవ్యాప్త కోటి ఉత్తరాల ఉద్యమ కార్యక్రమంలో భాగంగా శనివారం మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, సామాజిక వేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఉత్తరాలను ప్రధానమంత్రికి పంపించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతల నిర్వహణ నిమిత్తం ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి వెళ్లే వారు నిత్యం రైలు ప్రయాణం చేస్తుంటారని, కానీ రెండు మాత్రమే జనరల్ బోగీలు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం ఐదు సాధారణ బోగీలు ఉండేలా చూడాలని కోరారు. సాధన సమితి జాతీయ అధ్యక్షుడు, సామాజిక వేత్త డాక్టర్ పరికిపండల్ల అశోక్, జన అధికార సమితి ప్రధాన కార్యదర్శి పి. కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు మహేశ్ ఉన్నారు.

రూ.8.81 లక్షల నగదు సీజ్



పట్టుబడిన నగదులో సీఐ శ్రీనివాస్, తదితరులు

వాంకిడి: మండలంలోని టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.8.81 లక్షల నగదు పట్టుబడినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన 13 మంది కారులో ఆసిఫాబాద్ వైపు వెళ్తుండగా వారి వద్ద రూ.8,81,300 లభించాయని, నగదుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో లింగాపూర్ ఎస్సై ప్రవీణ్, ఏఎస్సై బాల్‌సింగ్, హెడ్ కానిస్టేబుల్ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్కే 7 గనిలో సభ్యత్వ నమోదు




సభ్యత్వ నమోదు చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే 7గనిలో టీబీజీకేఎస్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. యూనియన్ పిలుపులో భాగంగా గనిపై శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. గనిపై కార్మికులను కలిసి వారి సభ్యత్వం నమోదు చేశారు. సింగరేణిలో కార్మికుల హక్కులను సాధించి పెట్టిన చరిత్ర ఒక్క టీబీజీకేఎస్‌కు మాత్రమే ఉందన్నారు. కోలిండియాలో లేని హక్కులు, జాతీయ సంఘాలు పోగొట్టిన హక్కులను కూడా సాధించామని నేతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆ యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు తొంగల రమేశ్, నాయకులు దుర్గయ్య, రాజునాయక్, రాజేశం, గురుమూర్తి, రాజనర్సు, రత్నాకర్‌రెడ్డి, పోశంలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి వెంకట్రావు

శ్రీరాంపూర్: సీనియర్ కార్మిక నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ, టీబీజీకేఎస్ మాజీ అధ్యక్షుడు బి.వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ముందు ఆయన టీబీజీకేఎస్ అధ్యక్ష పదవికి, యూనియన్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆ యన ఏ పార్టీలో, సంఘంలో చేరకుండా ఉన్నా రు. శుక్రవారం రాత్రి ఆయన హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చా ర్జి దీపదాస్ మున్షి ఆయనకు సభ్యత్వం అందించారు. ఇదిలాఉంటే వెంకట్రావు టీబీజీకేఎస్‌లో పని చేయకముందు ఐఎన్టీయూసీలోనే సుదీర్ఘకాలం పనిచేశారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో ఎమ్మెల్సీగా పని చేశారు. రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానంద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని ఆయనను అభినందించారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం



జెండా ఆవిష్కరిస్తున్న పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి

జైపూర్: దేశ రక్షణకు మోదీ నాయకత్వం అవసరమని కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ తెలిపారు. జైపూర్ మండలం నర్వ గ్రామంలో భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. బీజేపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రెండు సీట్లతో మొదలైన భారతీయ జనతా పార్టీ ప్రస్థానం నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ ప్రజాస్వామ్య పార్టీగా గుర్తింపు పొందిందని తెలిపారు. దీని వెనక ఎంతో మంది నిస్వార్థసేవకుల త్యాగం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని అవుతారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి పెద్దపల్లిలో కాషాయ జెండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో నేతకాని సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టాల నాగరాజు, బీజేపీ నాయకులు ఎల్లయ్య, కామెర లక్ష్మణ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.